ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాలనీవాసులు

కుత్బుల్లాపూర్‌: ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే వివేకానంద్‌ అన్నారు. శనివారం పేట్‌బషీరాబాద్‌లోని క్యాంప్‌ కార్యాలయంలో పలువురు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రాలు, ఆహ్వాన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని, అన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను మెరుగు పరుస్తానన్నారు.

విద్యార్థినికి చేయూత



సౌమ్యకు చెక్కు అందజేస్తున్న దాతలు

జీడిమెట్ల: చదువుకునే విద్యార్థులకు సహాయం చేయడం సంతోషాన్ని ఇస్తుందని దాతలు అన్నారు. సాదుర్ల సౌమ్య అనే విద్యార్థిని చిక్కడపల్లిలోని అరోరా కళాశాలలో ఎంఎస్‌సీ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. ఆమెకు చదువు నిమిత్తం డబ్బు అవసరం ఉందని హార్ట్‌టు హెల్ప్‌ చారిటి ద్వారా తెలుసుకున్న దాతలు ప్రభాకర్‌, చిత్రమూర్తి, కుంటూరి జ్యోతి, పావని రూ.10 వేల చెక్కును శనివారం సౌమ్యకు అందజేశారు. కార్యక్రమంలో మూడే రవినాయక్‌, పవన్‌ కరుణాకర్‌ పాల్గొన్నారు.

భవిష్యత్‌లో మరిన్ని మెడల్స్‌ సాధించాలి



కృష్ణ కిషోర్‌ను అభినందిస్తున్న మేయర్‌ నీలా గోపాల్‌రెడ్డి

నిజాంపేట్‌: భవిష్యత్‌లో మరిన్ని మెడల్స్‌ సాధించి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని మేయర్‌ కొలన్‌ నీలా గోపాల్‌రెడ్డి అన్నారు. 12వ డివిజన్‌ ఇందిరమ్మ కాలనీ ఫేజ్‌ 3 కాలనీకి చెందిన పొన్నకంటి కృష్ణ కిషోర్‌ జాతీయ స్థాయి బాక్సింగ్‌ పోటీలో 46–49 కేజీల విభాగంలో బ్రాంజ్‌ మెడల్‌ సాధించడంతో ఆయనను మేయర్‌ దంపతులు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా మేయర్‌ మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు వారికి ఇష్టమున్న రంగాల్లో రాణించాలన్నారు. ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల ప్రోత్సాహం ఎంతో అవసరమన్నారు. తల్లిదండ్రులు దస్తగిరి, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఆడియో ఆవిష్కరణ



కార్యక్రమానికి హాజరైన డాక్టర్‌ శంకర నారాయణ తదితరులు

సుభాష్‌నగర్‌: సనాతన అంటే ఎల్లప్పుడు ఉండేదని, అదీ అంతం లేనిదని, అదే మన సనాతన ధర్మం గొప్పతనమని హాస్య బ్రహ్మ డాక్టర్‌ శంకర నారాయణ అన్నారు. శనివారం సూరారం కాలనీలోని కల్యాణ రామచంద్ర స్వామి ఆలయంలో సనాతన ధర్మం ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సామాజిక, సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ, నా ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సనాతన ధర్మం గొప్పతనాన్ని చాటుతూ రంగరాజు రంగారావు అద్భుతమైన పాటను రాయడం, దానికి రాయారావు విశ్వేశ్వర్‌ రావు స్వరకల్పన చేయడం అభినందనీయమన్నారు. నా ఫౌండేషన్‌ వ్యవస్థాపకుడు గోగులపాటి కృష్ణమోహన్‌ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో శ్రీరామాలయం కమిటీ అధ్యక్షుడు రవీందర్‌ యాదవ్‌, స్వరకల్పన రాయారావు విశ్వేశ్వర్‌ రావు, మంత్రి శేషారావు, ఆలయ ప్రధాన కార్యదర్శి సామంతపూడి మోహనరాజు, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్‌కు ఘన నివాళి

కుత్బుల్లాపూర్‌: మాజీ సీఎం ఎన్టీఆర్‌ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం కమ్మ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. షాపూర్‌నగర్‌, సాయిబాబానగర్‌, దూలపల్లి, కొంపల్లి, బహదూర్‌పల్లి, గండిమైసమ్మ తదితర ప్రాంతాల్లో ఎన్టీఆర్‌ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి హన్మంతరెడ్డి, కమ్మ సంఘం నాయకులు రవిశంకర్‌, రంగారావు, వీరబాబు, శివరామప్రసాద్‌, శ్రీనివాస్‌, ఎన్టీఆర్‌ అభిమానులు పాల్గొన్నారు.

సర్వే త్రా..సందడి!

- సంక్షేమ పథకాలకు అర్హుల ఎంపికపై కొనసాగుతున్న సర్వే
- రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికే కీలకం
- కొత్త నిబంధనలతో సర్వత్రా చర్చనీయాంశంగా మారిన వైనం
- గ్రామ/వార్డు సభల నిర్వహణకు కార్యాచరణ



సాక్షి,సిటీబ్యూరో: సంక్రాంతి సందడి ముగిసింది. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాల్లో కొత్త సంక్షేమ పథకాల సందడి మొదలైంది. ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, కొత్త రేషన్‌ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా తదితర పథకాల అమలును ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. దీంతో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను గత గురువారం నుంచి మొదలుపెట్టారు. రెండు, మూడు రోజులుగా పురపాలక సంఘాలు, గ్రామాల్లో ప్రత్యేక బృందాల పరిశీలన, హడావుడి కనిపిస్తోంది. ఈ నెల 20 వరకు నాలుగు పథకాల ఆశావహుల వివరాల పరిశీలన కొనసాగనుంది. ఆ తర్వాత 21 నుంచి 24 వరకు గ్రామ/వార్డు సభల్లో అభ్యంతరాలను పరిశీలించి లబ్ధిదారుల జాబితా రూపొందించనున్నారు. ఈ మేరకు గ్రామ/వార్డు సభల నిర్వహణపై జిల్లా అధికార యంత్రాంగం పక్కాగా కార్యాచరణ ప్రణాళికను ఖరారు చేయటం ద్వారా ముందుకు సాగుతోంది.

శాఖల వారీగా బాధ్యతలు

లబ్ధిదారుల గుర్తింపులో ముఖ్య బాధ్యతలను స్థానిక తహసీల్దార్లు, మండలాభివృద్ధి అధికారులకు ప్రభుత్వం అప్పగించింది. వీరి పర్యవేక్షణలో మండల వ్యవసాయాధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు తదితర సిబ్బందితో కూడిన బృందాలు సర్వే చేపడుతున్నాయి. ఏవోలు, ఏఈవోలు..రైతు భరోసా, తహసీల్దార్లు, పంచాయతీ కార్యదర్శులు.. రేషన్‌ కార్డులు, ఉపాధి హామీ అధికారులు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే తుది దశకు చేరుకోవటంతో సంబంధిత కమిటీలు త్వరలో గ్రామ/వార్డు సభలు నిర్వహిస్తాయి.

పెట్టుబడి సాయానికి 'సాగు యోగ్యత'

'రైతుబంధు' తరహాలో కాకుండా కేవలం సాగు భూములకు ఏడాదికి ప్రస్తుతం రూ.12 వేల పెట్టుబడి సాయం అందించాలని ప్రభుత్వ నిర్ణయించింది. ఈ నేపథ్యంలో వ్యవసాయేతర, సాగు యోగ్యం కాని భూముల వివరాలను ఏఈవోలు గ్రామాల వారీగా పకడ్బందీగా పరిశీలిస్తున్నారు. వివరాల్లో తప్పులుంటే చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించిన నేపథ్యంలో పారదర్శక పరిశీలన కొనసాగుతోంది.

'ఇందిరమ్మ కమిటీ'లే కీలకం

జిల్లాలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయటానికి కసరత్తు మొదలైంది. తొలి విడత ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున 17,500 ఇళ్లు మంజూరు చేయనున్నారు. దరఖాస్తుల సర్వే, తుది పరిశీలన (సూపర్‌ చెక్‌) ఇప్పటికే పూర్తవగా, తాజాగా గ్రామ, వార్డు సభల్లో ఇందిరమ్మ కమిటీల ఆమోదంతో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు.

సాగు చేయని భూములకు రైతు భరోసా కట్‌

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 40,960 మంది రైతులకు సంబంధించి 77,984 ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, ఇందులో ప్రతి ఏటా వానాకాలం సీజన్‌లో 35 వేల ఎకరాలు, యాసంగిలో దాదాపు 24 వేల ఎకరాల్లో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. ఈ లెక్కన జిల్లాలో 50 శాతం భూముల్లో పంట సాగు కావటం లేదు. కాంగ్రెస్‌ ప్రభుత్వం తాజా నిర్ణయంతో ఈ సాగులో లేని 50 శాతం భూములకు భరోసా దక్కదని భావిస్తున్నారు.

భూమిలేని వారికే ఆత్మీయ భరోసా

భూమిలేని నిరుపేద కూలీలకు ఆత్మీయ భరోసా కింద రూ.12 వేల సాయాన్ని (రెండు విడుతలుగా) ప్రభుత్వం అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. గతేడాది ఉపాధి హామీ పథకంలో కనీసం 20 పనిదినాలు చేసిన వారిని అర్హులుగా గుర్తిస్తున్నారు. భూమి లేని దరఖాస్తుదారుల వివరాలను ఉపాధి హామీ సిబ్బంది సేకరిస్తున్నారు. జిల్లాలో 18,014 జాబ్‌ కార్డులు ఉండగా, ఇందులో 19,387 మంది కూలీలు ఉన్నారు.

నిరీక్షణకు తెరపడేలా..

గతేడాది ప్రజా పాలనలో కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన లబ్ధిదారుల ఎంపిక కొనసాగుతోంది. కులగణన సర్వే ఆధారంగా రేషన్‌ కార్డుల ఎంపికపై దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో కొత్త రేషన్‌ కార్డుల కోసం వివిధ మార్గాల్లో 1.89 లక్షల దరఖాస్తులు అందినట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. వీరిలో ఎంత మందికి కార్డులు దక్కుతాయో చూడాల్సి ఉంది.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి



మండల కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న స్థానికులు, నాయకులు

దుండిగల్‌: ప్రభుత్వ భూములను ఆక్రమించి నిర్మాణాలను చేపడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ మాజీ నాయకుడు ఆకుల సతీష్‌ అన్నారు. ఈ మేరకు గండిమైసమ్మలోని మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గండిమైసమ్మ–దుండిగల్‌ మండల పరిధి సర్వే నంబరు 120లో 20 గుంటల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి ఓ పార్టీ కార్యాలయాన్ని నిర్మించారని, సదరు స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలన్నారు. డి.పోచంపల్లిలోని సర్వే నంబర్లు 120, 156, బహదూర్‌పల్లిలోని 227, 131, దుండిగల్‌లోని 453, 454, 323, 684, చర్చి గాగిల్లాపూర్‌లోని 214, బౌరంపేటలోని 166/9(1), 472, మల్లంపేటలోని 170లోని ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో నల్ల జయశంకర్‌, అమలేశ్వరి, చందు, అరుణ్‌ రావు, పులి బలరాం, సుహాసిని శక్తి, కవితారెడ్డి, శ్యాం కుమార్‌ రెడ్డి, రమేష్‌, సుధాకర్‌రెడ్డి, మహేష్‌, కుమార్‌ గౌడ్‌, రాజు, పాండు, ప్రశాంత్‌, గణేష్‌, ముఖేష్‌, శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్‌: అర్హులైన పేదలకు డబుల్‌ బెడ్‌రూమ్‌ ఇళ్లు, రేషన్‌ కార్డులు మంజూరు చేయాలని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్‌ మెంబర్‌ చంది శ్రీనివాస్‌ కోరారు. గాజులరామారం ఉప కమిషనర్‌ మల్లారెడ్డి, బాలానగర్‌ సివిల్‌ సప్లై ఏసీపీ కల్యాణ్‌లకు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ సిబ్బంది నిర్వహించిన సర్వేలో అర్హులైన పేదల పేర్లలో కొన్ని గల్లంతయ్యాయని, వారి దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వ పథకాల లబ్ధి చేకూర్చాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రచార కార్యదర్శి పత్తి రఘుపతి, జిల్లా కార్యవర్గ సభ్యుడు దయాసాగర్‌ గుప్తా, డివిజన్‌ అధ్యక్షుడు మాసాని రమేష్‌ తదితరులు పాల్గొన్నారు.

పుస్తెలతాడు స్నాచింగ్‌.. నిందితుల అరెస్ట్‌

దుండిగల్‌: వృద్ధురాలిని ఏమార్చి ఆమె మెడలోని పుస్తెల తాడును లాక్కెళ్లిన ఇద్దరు నిందితులను దుండిగల్‌ పోలీసులు శనివారం అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రం నంద్యాల జిల్లా నూనేపల్లె గ్రామానికి చెందిన కందుల సుదర్శన్‌రావు(26), జనగాం జిల్లా కొడకొండ్ల మండలం ఈదునూతల గ్రామానికి చెందిన పాలాస దామోదర్‌(25) నగరానికి వలస వచ్చి ఉప్పల్‌ రామాంతాపూర్‌లోని గణేశ్‌నగర్‌లో నివాసముంటున్నారు. స్నేహితులైన వీరిద్దరు చెడు అలవాట్లకు బానిసయ్యారు. విలాసవంతమైన జీవితాన్ని గడిపేందుకు దొంగతనాలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇదిలా ఉండగా.. బౌరంపేట గ్రామానికి చెందిన చింతకింది శంకరమ్మ (65) తన ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఈ నెల 11న గ్రామంలోని బొడ్రాయి సమీపంలో ఉన్న శ్రీనివాస క్లినిక్‌ వెళ్లింది. అక్కడ ఆమెతో మాటలు కలిపిన ఓ యువకుడు క్లినిక్‌లో వైద్య సేవలు ఎలా ఉన్నాయని ఏ మార్చాడు. ఎక్కడికి వెళ్తున్నావని అడగడంతో ప్రభుత్వ పాఠశాల పక్కనే ఉన్న తన ఇంటికి వెళ్తున్నానని బదులు ఇచ్చింది. దీంతో తన బైక్‌ పై ఇంటి వద్ద దింపుతానని నమ్మబలికి ఆమెను బౌరంపేటకు కాకుండా మల్లంపేట వైపు తీసుకెళ్లాడు. తన స్నేహితుడి సాయంతో ఆమె మెడలోని పుస్తెలతాడును లాక్కుని పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న దుండిగల్‌ పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా సుదర్శన్‌రావు, దామోదర్‌లుగా గుర్తించారు. సూరారంలో నిందితులిద్దరిని అరెస్ట్‌ చేసి వారి నుంచి 3.8 తులాల బంగారం, బైక్‌, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

జాతరకు పటిష్ట భద్రత

- నేడు చిత్తారమ్మ దేవి ప్రధాన జాతర
- పెద్ద ఎత్తున హాజరుకానున్న భక్తులు



హోమంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు

సుభాష్‌నగర్‌: గాజులరామారం చిత్తారమ్మ దేవి జాతర రెండవ రోజు భక్తుల తాకిడి పెరిగింది. శనివారం గవ్యాంత పూజలు, దేవత హోమాలు, గాజులరామారం నుంచి ఆలయం వరకు పూలగటం ఊరేగింపు జరిగింది. భక్తులు ఉదయం నుండే తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

నేడు ప్రధాన జాతర

ఆదివారం అమ్మవారి ప్రధాన జాతరలో భాగంగా తెల్లవారుజామున అభిషేకం, విజయ దర్శనం, ఒడి బియ్యం, 11 గంటలకు బోనాల సమర్పణ, సాయంత్రం పోతరాజులతో ఊరేగింపు, వినోద కార్యక్రమాలు జరుగనున్నాయి. ప్రధాన జాతరకు ఒక రోజు ముందు నుంచే ఆలయానికి ఇరువైపులా షాపులు వెలిశాయి. ఆలయానికి కిలోమీటర్‌ మేర వివిధ పార్టీ నాయకులు ఫ్లెక్సీలతో నింపి వేశారు.

భారీ భద్రత

జాతరలో ఎలాంటి ఆవాంఛనీయ ఘటనలు జరగకుండా బాలానగర్‌ డీసీపీ పరిధిలో ఇద్దరు అడిషనల్‌ డీసీపీలు, ఇద్దరు ఏసీపీలు, 10 మంది సీఐలు, 24 మంది ఎస్‌ఐలు, 250 మంది కానిస్టేబుళ్లతో భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా శనివారం అర్ధరాత్రి నుంచి సోమవారం వరకు జాతర నేపథ్యంలో షాపూర్‌నగర్‌ గాజులరామారం ప్రధాన రోడ్డుపై ట్రాఫిక్‌ పోలీసులు పలు ఆంక్షలు విధించారు.

నేడు విద్యుత్‌ సరఫరాకు అంతరాయం

చింతల్‌: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారము ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ సరఫరా నిలిపివేయనున్నట్లు బోయిన్‌పల్లి ఏడీఈ శ్రీకాంత్‌ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రాగ టూల్స్‌ సబ్‌ స్టేషన్‌ ఇండోర్‌ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఇండోర్‌ స్వింగ్‌ ఫీడర్‌ పరిధిలో గాంధీనగర్‌, గాంధీనగర్‌ ఇండస్ట్రియల్‌ ఏరియా, ఎల్‌ అండ్‌టీ, వేంకటేశ్వర స్కై టవర్స్‌, ఇండియన్‌ రబ్బర్స్‌ ఫీడర్‌ పరిధిలో సీఐఈ బాలానగర్‌, శ్రీరామ 11 కేవీ, శ్రీనివాస ఎంటర్‌ ప్రైజెస్‌, ఎంటీఏఆర్‌ టెక్నాలజీస్‌, ఉదయం 10 నుంచి 11 గంటల వరకు హెచ్‌ఏఎల్‌ సబ్‌ స్టేషన్‌ సౌభాగ్యనగర్‌ (ప్యారల్ల్‌ లైన్‌) ఫీడర్‌ పరిధిలో శ్రీరామ అండ్‌ కో, ఉషా కంపెనీ, డీలక్స్‌ పెయింట్స్‌, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాగా టూల్స్‌ సబ్‌ స్టేషన్‌ టీసీ బాలానగర్‌ ఫీడర్‌ పరిధిలో సీఐఈ బాలానగర్‌, బాలానగర్‌ ఇండస్ట్రియల్‌ ఏరియా, బిట్‌ డొమెస్టిక్‌, మెగా పార్కింగ్‌, రోచం ఫార్మా, ఎంఎస్‌ఎంఈ, జీహెచ్‌ఎంసీ డబుల్‌ బెడ్‌ రూమ్‌, నాగార్జున సిగ్నోడే ఫీడర్‌ పరిధిలో రంగారెడ్డి నగర్‌, రాజ్‌ ఫుడ్స్‌, టెక్నో ఎలక్ట్రికల్స్‌, బాలాజీ ఎలక్ట్రికల్స్‌ తదితర ప్రాంతాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

సభ్యత్వం ఆధారంగానే పదవులు

మహిళా కాంగ్రెస్‌ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు



నియామక పత్రాలతో మేడ్చల్‌ జిల్లా మహిళా కాంగ్రెస్‌ నాయకురాళ్లు

జీడిమెట్ల: సభ్యత్వం ఆధారంగానే పదవులు వస్తాయని మహిళా కాంగ్రెస్‌ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు అన్నారు. శనివారం షాపూర్‌నగర్‌లోని శుభం హోటల్‌లో నిర్వహించిన మహిళా కాంగ్రెస్‌ మేడ్చల్‌ జిల్లా కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా అధ్యక్షురాలు రాజనోళ్ల లక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కమిటీ నియామకపత్రాలను అందజేశారు. మహిళా కాంగ్రెస్‌ జిల్లా ప్రధాన కార్యదర్శులుగా జాజల రమ్య, మెరుగు సునీత, జిల్లా ఉపాధ్యక్షురాలిగా జ్యోతి, జిల్లా సంయుక్త కార్యదర్శిగా శోభారాణి, దమ్మాయిగూడ మున్సిపల్‌ అధ్యక్షురాలిగా మాధవి, ఏబ్లాక్‌ మహిళా అధ్యక్షురాలిగా సంధ్యారాణి, 121 డివిజన్‌ మహిళా కాంగ్రెస్‌ అధ్యక్షురాలిగా తూర్పటి కృష్ణవేణి, 114 మహిళా కాంగ్రెస్‌ అధ్యక్షురాలిగా పొన్నం రజిత, 116 డివిజన్‌కు జోజమ్మ, 117 డివిజన్‌కు భారతమ్మ, 118 డివిజన్‌కు జ్యోతి, 119 డివిజన్‌కు విజయలక్ష్మి, కుత్బుల్లాపూర్‌ బీ బ్లాక్‌ అధ్యక్షురాలిగా సొంటిరెడ్డి చైతన్యరెడ్డి, ఉపాధ్యక్షురాలిగా యాస్మిన్‌బేగం, 129 డివిజన్‌ మహిళా కాంగ్రెస్‌ అధ్యక్షురాలిగా అమ్మాజిలకు నియామక పత్రాలు అందజేశారు. పార్టీ కోసం కష్టపడే వారిని కాంగ్రెస్‌ పార్టీ గుర్తిస్తుందన్నారు.

మాజీ సైనికుడి నుంచి రూ.52 వేల మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపిస్తున్న పోలీసులు

కుత్బుల్లాపూర్‌: మిలటరీ మద్యం సీసాలు విక్రయిస్తున్న మాజీ సైనికుడిని ఎక్సైజ్‌ పోలీసులు అరెస్ట్‌ చేశారు. మేడ్చల్‌ జిల్లా ఎక్సైజ్‌ అధికారి షేక్‌ ఫయాజుద్దీన్‌ వివరాల ప్రకారం.. చింతల్‌ శ్రీరాంనగర్‌ ప్రాంతానికి చెందిన కాటమల నాగేందర్‌రావు(59) మాజీ సైనికుడు. ప్రస్తుతం ఆయన ఓ ప్రైవేట్‌ కంపెనీలో సెక్యూరిటీగా పని చేస్తున్నాడు. నాగేందర్‌రావు కొంత కాలంగా మిలటరీ మద్యాన్ని విక్రయిస్తున్నాడు. విషయం తెలుసుకున్న టాస్క్‌ఫోర్స్‌ సిబ్బంది అతని ఇంటిపై దాడి చేసి రూ.52 వేలు విలువ చేసే 26 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కుత్బుల్లాపూర్‌ ఎక్సైజ్‌ అధికారులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎస్‌.నర్సిరెడ్డి, ఎస్‌ఐ పవన్‌ కుమార్‌ రెడ్డి, సిబ్బంది సత్తార్‌, సంజయ్‌ ఈ దాడిలో పాల్గొన్నారు.

చోరీ ఘటనలో నిందితుడి అరెస్టు

సుభాష్‌నగర్‌: తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడిన పాత నేరస్తుడిని అరెస్టు చేసిన ఘటన సూరారం పోలీస్‌స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. సూరారం వెంకట్రామ్‌నగర్‌కు చెందిన కావలి విజయ్‌కుమార్‌ సంక్రాంతి పండుగకు ఈ నెల 14న విజయవాడకు కుటుంబ సమేతంగా వెళ్లాడు. అదే రోజు రాత్రి ఇంట్లో దొంగలు పడి బీరువాలో ఉన్న 8 తులాల బంగారు ఆభరణాలు, 15 తులాల వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. శనివారం సాయిబాబానగర్‌ బస్టాప్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న సూరారం సంతోష్‌నగర్‌కు చెందిన తన్నీరు సూరి(19)ని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా.. చోరీ చేసినట్లు అంగీకరించడంతో అతని నుంచి బంగారు, వెండి ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

ఫోర్జరీ సంతకాలతో ప్లాట్ల విక్రయం

వేర్వేరు ఘటనల్లో ఓ మహిళ, మరో వ్యక్తి రిమాండ్‌



కాలిముత్తు

దుండిగల్‌: ఆధార్‌ కార్డులో పేర్లు మార్చి.. నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి.. ఫోర్జరీ సంతకాలతో ప్లాట్లను విక్రయించిన రెండు వేర్వేరు ఘటనల్లో ఒక మహిళతో పాటు మరో వ్యక్తిని దుండిగల్‌ పోలీసులు అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. అల్వాల్‌, మంగాపురం కాలనీకి చెందిన అల్లూరి విజయరామ రాజు కొన్ని సంవత్సరాల క్రితం దుండిగల్‌ మున్సిపాలిటీ మల్లంపేటలో కేవీఆర్‌ వెంచర్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో గతంలోనే ప్లాట్లను విక్రయించాడు. తనకు వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పులను తీర్చేందుకు తన సొంత గ్రామానికి వెళ్లాడు. తిరిగి ఇటీవల మల్లంపేటకు వచ్చాడు. మల్లంపేటకు చెందిన మండల నరేశ్‌, శివలతో పాటు మరి కొంత మంది రామరాజు పేరు మీద నకిలీ ఆధార్‌ కార్డులను సృష్టించి 2022 సంవత్సరంలో శ్రీకాంత్‌ సాహూ అనే వ్యక్తికి విక్రయించారు. అదే సమయంలో ఫోర్జరీ సంతకంతో పాటు నకిలీ పత్రాలను సృష్టించి సూరారంలోని కుత్బుల్లాపూర్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌ సైతం చేశారు. ఈ విషయాన్ని గుర్తించి గత సంవత్సరం సెప్టెంబర్‌లో విజయరామ రాజు దుండిగల్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం బొల్లారం ప్రాంతానికి చెందిన సంతుల కాలిముత్తు(33) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కాలిముత్తు తన ఆధార్‌ కార్డులోని పేరును రామరాజుగా మార్చుకుని అతని సంతకాన్ని ఫోర్జరీ చేయడమే కాకుండా కాలిముత్తే రామరాజు అన్నట్లుగా సబ్‌రిజిస్ట్రార్‌ కార్యాలయంలో వ్యవహరించి రిజిస్ట్రేషన్‌ చేశాడని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ మేరకు శనివారం కాలిముత్తును అదుపులోకి తీసుకుని నకిలీ, ఒరిజినల్‌ కార్డులను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.

మరో ఘటనలో..



లావణ్య

కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన డాక్టర్‌ ఆర్‌.రవికుమార్‌కు మల్లంపేట ప్రాంతానికి చెందిన రాకేశ్‌, అదే ప్రాంతానికి చెందిన పూర్ణిమను భూ యజమానిగా.. ఆమె వద్ద బిల్డర్‌గా పని చేస్తున్నట్లుగా నరేష్‌ పరిచయం చేశాడు. వీరు ముగ్గురు కలిసి మల్లంపేటలోని కేవీఆర్‌ లే అవుట్‌లో రూ.75 లక్షలకు 167 గజాలను రవికుమార్‌, ఆమె భార్య అరుణ పేర్ల మీద రిజిస్ట్రేషన్‌ చేశారు. అయితే సదరు స్థలం ప్రస్తుతం అమెరికాలో ఉంటున్న జాప సృజనకు చెందినదిగా గుర్తించిన రవికుమార్‌ తాను మోసపోయాయని గ్రహించి గత సంవత్సరం డిసెంబర్‌లో దుండిగల్‌ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. నరేశ్‌, రాకేశ్‌, పూర్ణిమలు కేవీఆర్‌ ప్రాంతానికి చెందిన గార లావణ్య(35)ను సృజనగా నమ్మించి నకిలీ పత్రాలతో సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయంలో రిజిస్ట్రేషన్‌ చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. దీంతో శనివారం లావణ్యను అరెస్ట్‌ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ రెండు ఘటనల్లో ప్రధాన నిందితుడైన మండల నరేశ్‌ గత సంవత్సరం ఆగస్టు నెలలో గాజులరామారంలోని ఓ బార్‌ వద్ద కాల్పులు జరపడం అప్పట్లో కలకలం రేపింది. ఆ ఘటనలో జీడిమెట్ల పోలీసులు అతడిని అరెస్ట్‌ చేసి జైలుకు సైతం పంపారు.